# కొత్త రచయితలు

# హృదయ 'స్పందన'

స్టూడెంట్స్ అంతా వేసవి సెలవులు ముగించుకొని నూతనోత్సాహంతో ఆ రోజే కాలేజీలో అడుగు పెట్టారు. అందువల్ల కాలేజీ క్యాంపస్ అంతా స్టూడెంట్స్ పలకరింపులతోను, పరాచకాలతోను ఎంతో సందడిగా వుంది. క్యాంటీన్‌లో టీ త్రాగి బయటికి వచ్చి ఫ్రండ్స్ ఎవరైనా కన్పిస్తారేమోనని చుట్టూ చూశాను. ఒక చెట్టు క్రింద నుంచుని కొందరు మిత్రులు కబుర్లు చెప్పుకుంటూ కన్పించారు. అటు వెళ్దామని బయలు దేరేంతలో బ్లూ శారీలో రాయంచ ఒకటి కదలి వస్తుందా అన్పించేలా, ఓ విలక్షణమైన నడకతో ఒంటరిగా వస్తున్న ఓ యువతి కన్పించి ఆగిపోయాను.

ఎవరబ్బా? ఈ కాలేజీ మాత్రం కాదు. కానీ ఇదివరకెక్కడో పరిచయమున్న ముఖంలానే వుంది. అరె! అమ్మ స్పందనలా వుంది. వుండడమేంటి, స్పందనే. చూసి నాలుగేళ్ళవుతూంది. ఎప్పుడో టెన్త్ వరకు క్లాస్‌మేట్. మనిషి చాలా యాక్టివ్. స్కూల్లో జరిగే అన్ని కార్యక్రమాల్లో ఎంతో వుత్సాహంతో పాల్గొనేది. పాటలు కూడా బాగా పాడుతుంది. అప్పట్లో నేను కూడా డిబేటింగ్ మొదలయిన వాటిల్లో పాల్గొనడం వల్ల ఇద్దరికీ బాగా పరిచయం. టెన్త్ అయిపోయాక వాళ్ళ నాన్నగారికి గుంటూరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయారు. మళ్ళీ ఇప్పుడే చూడడం. అప్పటికీ, ఇప్పటికీ స్పందన రూపంలో చాలా మార్పొచ్చింది. అందుకే త్వరగా గుర్తు పట్టలేకపోయాను. కొద్దిగా ఎత్తు పెరిగింది. నడకలో ఇదివరకు లేని హుందాతనం ఉట్టి పడుతుంది. అంతకు మించి ఏవో క్రొత్త సోయగాలు. ఆమెని చూసిన వాళ్ళందరికీ అదోరకమైన స్పందనలు కలగజేస్తూ తన పేరుకు సార్థకత తెచ్చేట్లుగా వుంది. ఆలోచనలలోంచి బయటకు వచ్చి విష్ చేద్దామని ఆమె వైపు కదిలాను. ఇంతలో స్పందన నా వైపు చూసి పలకరింపుగా నవ్వింది.

## లవ్ స్టోరీ

'అబ్బ! వెన్నెల, మల్లెలు చల్లినట్లు ఎంత అందంగా వుందా నవ్వు!' స్వగతంగా అనుకున్నాను.

"హల్లో! వంశీగారు. గుర్తు పట్టలేదా, ఏంటీ? పలకరింపుగా నవ్వితే ఏదో ఆలోచనలలోకి వెళ్ళిపోయారు" అంది స్పందన.

"అబ్బే, అదేం లేదు. అనుకోకుండా మీరిక్కడ కన్పించేసరికి కొద్దిగా ఆశ్చర్యపోయాను. ఇంతకీ ఈ వూరెప్పుడు వచ్చారు? ఎక్కడుంటున్నారు? పుస్తకాలు తీసుకొని కాలేజీకి వచ్చారు! మరీ కాలేజీలో ఎప్పుడు చేరారు? ఇంతకీ డిగ్రీ ఆర్ట్సా, సైన్సా" అదో రకమైన ఉద్వేగంతో అడిగాను నేను.

"అయిపోయిందా మీ ప్రశ్నల పరంపర? మీ వాగ్ధోరణి అప్పటికీ, ఇప్పటికీ ఏమీ మారలేదు. సరే చెబుతాను వినండి. మొన్నీ మధ్య ఒక నెల క్రితమే మా నాన్నగారికి ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది. ప్రస్తుతానికి మా మామయ్యగారింట్లో వుంటున్నాం. అద్దెకి మంచి ఇల్లు దొరకగానే మారిపోతాం. ఇకపోతే ఇంటర్, ఆ తరువాత బి.ఎస్.సి. రెండు సంవత్సరాలు గుంటూరులోనే. ఫైనలియర్ ఇంక ఇక్కడే" చెప్పింది స్పందన.

"ఇంతకీ అన్ని వివరాలూ నన్నే అడిగారు. మీ వివరాలు చెప్పలేదు" మరలా తనే అంది.

"మీకు తెలియనిదేముంది. చదువుకీ, మనకీ ముక్కెదురు! ఏదో బోర్డర్ మార్కులతో గట్టెక్కుతున్నాను. ప్రస్తుతం బి.ఏ. ఫైనలియర్" చెప్పాను.

"ఇంతకీ మన క్లాస్‌మేట్స్ అందరూ ఏమయ్యారో తెలుసా?" అడిగింది స్పందన.

"ఎందుకు తెలియదు! ఆడవాళ్ళందరూ పెళ్ళిళ్ళయి వెళ్ళిపోయారు. ఇక మగవాళ్ళందరూ ఇంటర్ సైన్స్ గ్రూప్ తీసుకొని ఆ తరువాత ఇంజినీరింగ్, ఎం.బి.బి.ఎస్. అంటూ తలో దిక్కూ వెళ్ళిపోయారు" చెప్పాను నేను.

"సరే ఇక వస్తానండి. మొదటి రోజు ఎలాగూ క్లాస్‌లుండవు కదా. తెలిసిన ఫ్రెండ్స్ ఎవరైనా కన్పిస్తారేమోనని వచ్చాను. రేపు కలుసుకుందాం" చెప్పి కదిలింది స్పందన.

వెళ్తున్న స్పందన వైపు కన్నార్పకుండా అలాగే చూస్తుండిపోయాను. ఆ తరువాత రోజులు చాలా వేగంగా గడిచాయి. ఇద్దరి భావాలు, అభిరుచులు ఒక్కటే కావడం వల్ల ఈ మధ్య కాలంలో మరింత సన్నిహితులమయ్యాం. సంబోధనకూడా మీరు నుంచి నీవుకి మారింది. నా మనసులో ఆమె పట్ల వున్న ఆకర్షణ కాస్తా ప్రేమగా రూపుదిద్దుకోసాగింది.


ఓ రోజు "స్పందనా. రేపటి నుంచి ప్రిపరేషన్ హాలిడేస్. రేపటి నుంచి మనకి కలసి కబుర్లు చెప్పుకొనే వీలుండదు. కనుక ఆఖరు సారిగా అలా బీచ్ వైపు వెళ్ళి వద్దామా?" అడిగాను.

"ఓకే, పద" చెప్పి కదిలింది స్పందన.

ఇద్దరం కలిసి బీచ్‌కి చేరుకున్నాం. ఒక ప్రక్క పిల్లలు చేరి ఆడుకుంటున్నారు. అక్కడక్కడ కొన్ని జంటలు కూర్చుని వున్నాయి. బహుశా మా బాపతే అయి వుంటుంది. ఇద్దరం కాస్త జనాభా తక్కువ వున్న ప్రదేశాన్ని ఎన్నుకుని కూర్చున్నాం. ఉవ్వెత్తున లేచి పడే కడలి తరంగాలు ఎంతో కనుల విందుగా వున్నాయి. ఆగాగి సముద్రం పై నుంచి వీచే చల్లని చిరుగాలులు అలసిన మా శరీరాలను సేద తీర్చి ఎంతో హాయిని కలిగిస్తున్నాయి. ఈ రోజెందుకో గాని స్పందనని చూస్తుంటే నా మనసులో ఓ రకమైన అలజడి కలగసాగింది.

"స్పందనా, ఈ రోజు నువ్వెంత అందంగా వున్నావో తెలుసా! నిన్ను చూస్తుంటే ఎక్కడో చదివిన ఒక కవిత గుర్తు కొస్తుంది. బహుశా నిన్ను

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్



చూసే వ్రాసి వుంటాడనిపిస్తుంది'' అన్నాను నేను.

''పొగడ్తలు చాలు గాని, ఇంతకీ ఆ కవి తేంటో చెప్పు, వింటాను'' అంది స్పందన.

''ఎర్ర గులాబీల
అసలు రంగు తెలుపు!
కానీ-
నీ సౌందర్యం చూసిన తర్వాతే
అవి సిగ్గుపడి ఎర్రబడ్డాయి!

తెల్లగులాబీల
అసలు రంగు ఎఋపు!
కానీ
నీ లావణ్యం చూసిన తర్వాతే
అవి తెల్లబోయాయి!''
చెప్పాన్నేను.

''నిజంగా చాలా బావుంది. చాలా సున్నితంగా మనసుకి హత్తుకొనేట్లు చెప్పారు ఎవరోగాని'' అంది స్పందన.

''స్పందనా, ఓ పాట పాడవు?'' అడిగాను నేను.

''ఇప్పుడా! సారీ, ఇంకొకసారెప్పుడైనా చూద్దాం'' అంది స్పందన.

''నిజంగా చాలా రోజులయింది నీ పాటవిని. ప్లీజ్ స్పందనా'' మరలా అడిగాను నేను.

సరే అని సుఖ దుఃఖాలులో సుశీల పాడిన మంచి పాపులర్ సాంగ్ ''ఇది మల్లెల వేళయని ఇది వెన్నెల మాసమని......'' పాడసాగింది. పాట సాగుతున్నంత సేపూ ఏదో తెలియని లోకంలో విహరించసాగాను. ముఖ్యంగా ఆ స్వరం గోటితో వీణ తీగను మీటినట్లుగా వుంది. పాట పూర్తయినా గాని అలాగే వుండిపోయాను. ఇంతలో చప్పట్లు వినిపించడంతో ఈ లోకంలోకి వచ్చాను. చుట్టూ జనం మూగి వున్నారు. ఇద్దరం సిగ్గుపడి అక్కడి నుంచి దూరంగా వచ్చేశాం.

''అద్భుతంగా పాడావు. ప్రాక్టీస్ చేస్తే ఎక్కడయినా ప్రోగ్రాం లివ్వవచ్చుగా'' చెప్పాను నేను.

''ఏదో ఉబుసుపోక పాడుకునేవి. ప్రోగ్రాం లివ్వాలన్నంత ఆసక్తి లేదు'' చెప్పింది స్పందన.

సూర్యుడు ఇక తన డ్యూటీ చాలించి వెళ్ళిపోయాడు. చీకటి చుట్టూ అలుముకొని వుంది. మాటలలో ఇద్దరం గమనించలేదు.

''చీకటి పడింది. వెళ్దామా?'' అడిగింది తను.

స్పందనను వాళ్ళింటి దగ్గిర డ్రాప్ చేసి ఇంటికి వచ్చి స్నానం చేశాను. ఇంటికి వచ్చానే గాని ఏ పని చేస్తున్నా మనసంతా స్పందన మీదే. ముఖ్యంగా ఈ రోజు నా మనసు నా మాట వినడం లేదు. ఆమె కెలాగైనా నా మనసులో విషయాన్ని తెలియ జేయాలి. ఆలస్యం చేయ కూడదనిపించింది. కానీ, ఎదురుగా ఎలా చెప్పడం? ఓ లెటర్ వ్రాసి పోస్ట్ చేస్తే? అవును. అదే బావుంటుందనుకొని ప్రారంభించాను. లెటర్ వ్రాద్దామని కూర్చున్నానే కాని ఏం వ్రాయాలి, ఎలా సంబోధించడం. నాలో ఏదో సందిగ్ధత. చివరి కెలాగైతేనేం నాలుగైదు పేజీలు వేస్టు చేసి లెటర్ పూర్తి చేశాను.

......స్పందనకు,

నీ అంగీకారం తెలియకుండా ఏమని సంబోధించాలా అని చాలా సేపు సతమతమయ్యాను. చివరికి ఇలా ప్రారంభిస్తున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. కేవలం ఇది ఒక్కనాటి ఆకర్షణ కాదు. కలసిన మన అభిరుచులు, ఇన్ని రోజుల మన సహవాసం నీ మీద నా ప్రేమను బలపర

రచయిత చిరునామా:
వి. శ్రీనివాస్ రెడ్డి
20-3-17, లంబాడీ స్ట్రీట్,
బందలమిట్ట,
ఒంగోలు -523 002.

వింది. నీవు లేక బ్రతకలేనని పెద్ద పెద్ద మాటలు వ్రాయలేనుగాని, ఆ జీవితం నరక సదృశంగా తోస్తుంది. నీతోటి జీవితం ఊహకే ఎంతో మధురంగా అన్పిస్తుంది. ఓ సగటు మగవాడు తన కాబోయే భార్య ఎలా వుండాలని కోరు కుంటాడో నీ సమక్షంలో నాకలా అన్పిస్తుంది. నీతో కలసి జీవితాన్ని పంచుకోవాలని కోరు కుంటూ, ఇంతకన్నా ఏం వ్రాయాలో తెలియక ఇంతటితో ముగిస్తున్నాను. నీ అంగీకారం కోసం నిరీక్షిస్తూ...

ప్రస్తుతానికి
నీ నేస్తం
వంశీ.

ఉత్తరమైతే ఏదో వ్రాసి పోస్ట్ చేశానే గాని నా మనసు మనసులో లేదు. తను ఈ లెటర్‌కు ఎలా రియాక్టవుతుందోనన్న భయం ఓ ప్రక్క, తను తప్పక అంగీకరిస్తుందన్న నమ్మకం ఇంకో ప్రక్క. సమాధానం కోసం వేయి కళ్ళతో ఎదురు చూడ సాగాను. ఓ వారం తరువాత స్పందన నుంచి సమాధానం వచ్చింది. ఉత్తరం అందుకొని విప్ప దీస్తున్న నా చేతులలో ఏదో సన్నని ప్రకంపన.

డియర్ మొద్దూ,

వ్రాసిన మొదటి లెటర్ వరకు గుడ్. నీ మీద ఇష్టం లేకపోతే నీతో అంత సన్నిహితంగా ఎలా మెలిగాననుకున్నావు! ప్రస్తుతానికి ప్రేమ, గీమ అన్నీ కట్టిపెట్టి పరీక్షలకు గట్టిగా చదువు. ముందు డిగ్రీ కంప్లీట్ చేసి మన కాళ్ళ మీద మనం నిలబడాలి. అంతవరకూ నో క్వెశ్చన్ ఆఫ్ ప్రేమ. నేనూ ఆ రోజు కొరకు ఎదురు చూస్తుంటాను. గుడ్‌లక్, వుంటాను.

ముద్దులతో
నీ హృదయ 'స్పందన'

సంతోషంగా ఉత్తరంలోంచి తల ఎత్తిన నాకు దూరంగా రేడియోలోంచి వస్తున్న పాట చెవుల బడింది.



మధుర భావాల సుమమాల
మనసులో పూచె నీవేళ ......

